నేటి నుంచి జొన్నల కొనుగోళ్లు నిలిపివేత

బోథ్, మే 11: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మార్కెట్‌లోని జొన్నల కొనుగోలు కేంద్రంలో అధిక మొత్తంలో నిల్వ ఉండడం వల్ల, వాతావరణం మార్పుల వలన ఈ నెల 12, 13వ తేదీల్లో కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి షెడ్యూల్ ప్రకారం యాథావిధిగా కొనుగోలు చేస్తామని, రైతులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎదులాపురం, మే 11: ఆదిలాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదివారం పట్టణ పరిధిలోని 40 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మయూర్ చంద్ర, ప్రవీణ్, రవి పాల్గొన్నారు.

సీపీఐ మావల మండల 3వ మహాసభలు

ఎదులాపురం, మే 11: మావల మండలంలో 35 సంవత్సరాల క్రితం ముగ్గురు కార్యకర్తలతో ప్రారంభమైన సీపీఐ, పేదలకు ఇండ్ల స్థలాలు, మండల పరిధిలో మౌలిక వసతులు, స్కూళ్లు కట్టించిన ఘనత సాధించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని రాంనగర్‌లో మావల మండల 3వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ తీసి పార్టీ జెండాను రాష్ట్ర సమితి సభ్యురాలు నళిని రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుంటాల రాములు, షేక్ పాషా, అద్దంకి రమేశ్, రాందాస్ పాల్గొన్నారు.

పూర్ణచందర్‌నాయక్ కలిసిన అంబేద్కర్ అసోసియేషన్ సభ్యులు

ఉట్నూర్, మే 11 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో నూతనంగా ప్రతిష్ఠించబోయే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి సహాయ సహకారాలు అందించాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు పూర్ణచందర్ నాయక్‌ను ఉట్నూర్ అంబేద్కర్ అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఆదివారం కలిశారు. ఇక్కడ అంబేద్కర్ అసోసియేషన్, ఉద్యోగ సంఘాల నాయకులు ఉన్నారు.

గిరి గ్రామాల్లో పెర్సపేన్ పూజలు

ఇంద్రవెల్లి/నార్నూర్, మే 11: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని వడగాం గ్రామంలో కోర్‌కార్ ఆత్రం వంశీయుల ఆధ్వర్యంలో, నార్నూన్ మండలంలోని ఖైరదట్వా గ్రామంలో పెందోర్ వంశీయుల ఆధ్వర్యంలో ఆదివారం పెర్సపేన్‌కు సంప్రదాయ పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వడ్డెర కాలనీలో కార్డన్ సెర్చ్

ఎదులాపురం, మే 11: ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెర కాలనీలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ కమ్ కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ విష్ణు ప్రకాశ్, మహిళా ఎస్ఐలు, సివిల్, క్యూఆర్టీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దుష్టశక్తులను తరిమి కొట్టాలని పూజలు

భైంసా, మే, 11 : పాకిస్తాన్ దుష్టశక్తుల్ని తరిమి కొట్టేలా భారత సైన్యానికి మరింత శక్తిని ప్రసాదించాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గట్టుమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో జిల్లా వాసి ప్రతిభ

నిర్మల్ అర్బన్, మే 11 : ఎప్‌సెట్ ఫలితాల్లో నిర్మల్ జిల్లాకు చెందిన తొడి శెట్టి రిషిత్ ఇంజినీరింగ్ విభాగంలో 296వ ర్యాంకును సాధించి ప్రతిభ కనబర్చాడు. వీరు నిర్మల్ మండలం వెంగ్వాపేట్‌కు చెందిన అరుణ్ కుమార్-విజయలక్ష్మి దంపతుల కుమారుడు ప్రస్తుతం వీరు నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శిని నగర్‌లో నివాసం ఉంటున్నారు. హైస్కూల్, ఇంటర్ ప్రైవేట్ కళాశాలలో చదివాడు. ఇటీవల జేఈఈ మెయిన్స్‌లో కూడా 99.56 శాతం మార్కులు సాధించాడు.

కోతుల దాడిలో ఒకరికి గాయాలు

నిర్మల్ అర్బన్, మే 11 : నిర్మల్‌లోని ఆదివారం వెంగ్వాపేట్ రోడ్డులో గాజుల్‌పేట్ కాలనీకి చెందిన మహ్మద్ అన్వర్ ఆర్‌అండ్‌బీ ఉద్యోగిపై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఇంటివద్ద ఉన్న కోతులను తరిమేందుకు రాళ్లతో కొట్టగా అవి ఒక్కసారిగా అతనిపై దాడి చేశాయి.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల చెంతకు

బైండ్ల ప్రశాంత్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ సుప్రియ

లక్ష్మణచాంద, మే 11 : మండల కేంద్రానికి చెందిన బైండ్ల ప్రశాంత్ కనిపించకుండా పోవడంతో ఈ నెల 8న అతని తండ్రి ఆనంద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో అతనికోసం గాలించిన పోలీసులు నిర్మల్‌లో ఆయనను గుర్తించారు. ఆదివారం అతనిని పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ కుమారుడి ఆచూకీని కనుగొని అప్పగించిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భీంపూర్‌లో 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్

తాంసి(భీంపూర్), మే 11: విద్యుత్ వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని భీంపూర్‌లో 15 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం ఏర్పాటు చేశారు. అనంతరం ఏఈ తిరుపతి రెడ్డి విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది అనిల్, శౌకత్, మోహన్, రవీందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం


మాతృమూర్తులను సన్మానిస్తున్న చిన్నారులు

నిర్మల్ అర్బన్, మే 11 : నిర్మల్‌లోని విశ్రాంతం ఉద్యోగుల సంఘ భవనంలో సంగీత సాహిత్య సామాజిక సేవా సంస్థ కలం స్నేహం ఆధ్వర్యంలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథులు పాల్గొన్న హరి రమణ, నివేదిత మాట్లాడుతూ తల్లులను గౌరవించడం, వృద్ధాప్యంలో వారి ఆలన పాలన చూసుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో కలం స్నేహం అధ్యక్షురాలు దేవి ప్రియ, దశరథ్, పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

బైక్ నంబర్ మార్పింగ్ చేసిన వ్యక్తి అరెస్ట్

ఎదులాపురం, మే 11: బైక్ నెంబర్ మార్పింగ్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాశ్ తెలిపారు. ఆదిలాబాద్ వడ్డెర కాలనీకి చెందిన ఒల్లెపు బాబాన్న తన వద్ద ఉన్న ద్విచక్ర వాహన నంబర్ ఎపీ 01 ఏఏ 0841కు బదులుగా ఎపీ 01 ఏఏ 0911 మార్పింగ్ చేశాడు. ఆదివారం అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దేశీదారు బాటిళ్లు స్వాధీనం

ఎదులాపురం, మే 11 : ఆదిలాబాద్‌లోని వడ్డెర కాలనీకి చెందిన దారంగుల గంగమ్మ వద్ద నుంచి రూ.785 విలువగల 17 దేశీదారు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని టూ టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాష్ తెలిపారు. మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జీపీ భవనం పూర్తయ్యేదెన్నడో .. ?

- బిల్లులు రాక నిలిచిపోయిన పనులు
- పట్టించుకోని ఐటీడీఏ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు
- పైలెట్ గ్రామంపై పట్టింపేది?

అడవి సారంగాపూర్‌లో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం

ఖానాపూర్ రూరల్, మే 11 : అడవి సారంగాపూర్ గ్రామస్తులు ఎన్నో ఏళ్లు ఎదురుచూడగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయానికి భవనం మంజూరైంది. భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయానికి భవనం లేక సిబ్బందితో పాటు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదివాసుల సంక్షేమానికి ఐటీడీఏ శాఖ నుంచి రూ.20 లక్షలతో నూతన గ్రామపంచాయతీని మంజూరు చేసింది. అప్పుడు కాంట్రాక్టర్ ప్రారంభంలో స్లాబ్ వేశారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ పనులకు బిల్లులు ఇవ్వకపోగా మధ్యలోనే ఎక్కడిపనులు అక్కడే నిలిచి పోయాయి.

ఫారెస్టు అద్దె భవనంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయం

పైలెట్ గ్రామంపై పట్టింపేది ?

తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం దశల వారీగా మండలానికి ఒక్క గ్రామ పంచాయతీని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఖానాపూర్ మండలంలోని ఆదివాసీ గ్రామమైన అడవి సారంగాపూర్‌ను ఎంపిక చేశారు. నిరంతరం సంక్షేమ పథకాల అమలు కోసం వస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు నిలబడుదామంటే నీడ లేదని, అయినా గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సంక్షేమ పథకాల అందించేందుకు, గ్రామ పంచాయతీ కార్యకలాపాలకు కార్యాలయం లేక ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లులు వస్తలేవని పనులు చేస్తలేరు..

నేను ఖానాపూర్ మండలంలోని అడవి సారంగాపూర్ గ్రామ పంచాయతీకి చెందిన సర్పంచ్ మాడావి లింగు భర్త మాడావి జంగుని. మాకు ఐటీడీఏ నుంచి రూ. 20 లక్షల పంచాయతీ భవనం మంజూరైంది. మూడేళ్ల కింద పనులు ప్రారంభించారు. బిల్లులు వస్తలేవని పనులు నిలిపివేశారు. గ్రామ పంచాయతీ సమావేశాలు చెట్ల కిందనే నిర్వహిస్తున్నాం. ఫారెస్టుకు చెందిన ఒక్క గదిని అద్దెకు తీసుకొని అందులో రిజిస్టర్లు ఉంచాము. ఐటీడీఏ శాఖ అధికారులకు ఫోన్లు చేస్తే బిల్లులు వస్తలేవు మేము ఎం చేయాలని అంటున్నారు. గ్రామానికి అధికారులు ఎన్నో సార్లు వస్తున్నా గ్రామ పంచాయతీ భవనం పనులు పట్టించుకుంట లేరు.

-మాడావి జంగు, గ్రామస్తుడు

అధికారులు వస్తే నిలబడుదామంటే నీడ లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మా గ్రామాన్ని ఇటీవల పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. సంక్షేమ పథకాల అమలు కోసం నిత్యం ఏదో ఒక శాఖకు చెందిన అధికారులు వస్తున్నారు. వాళ్లకు నిలబడుదామంటే నీడ లేదు. మండుటెండలో దినమంత చెట్లకింద ఉండి పనులు చేసుకుంటున్నారు. ఉన్న తాధికారుల పట్టించుకొని గ్రామపంచాయతీ పనులను జరిగేలా చూడాలి.

-ఆత్రం భీంరావ్, గ్రామస్తుడు

బుద్ధ జయంతిని విజయవంతం చేయాలి

ఎదులాపురం, మే 11: ఆదిలాబాద్‌లోని కైలాష్‌నగర్‌లోని బుద్ధ విహార్‌లో సోమవారం నిర్వహించనున్న 2569వ బుద్ధ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజడే ప్రజ్ఞా కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు అంబేద్కర్ చౌక్‌లో ధ్వజారోహణ, వందన, దమ్మ శాంతి ర్యాలీ అంబేద్కర్ చౌక్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. అనంతరం కైలాష్‌నగర్‌లోని బుద్ధ విహార్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడువిఠల్ బుక్టే, ప్రధాన కార్యదర్శి దయానంద్ పొటపోడే, మాజీ అధ్యక్షుడు దయానంద్ కాంబ్లే, మహిళా ఆర్గనైజర్లు బేబీ తాయి కానిందే, అమ్రాపాల దగ్డే, లలితాబాయి ఖిల్లారే ఆర్గనైజర్లు రాందాస్ భలేరావ్ పుణేశ్ వాఘుమరే, వినోద్ గైకాంబల్, అనిల్ శిండే, సమాధాన్ గైక్వాడ్ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న వీసీ గోవర్ధన్

బాసర, మే 11 : బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు ప్లేస్‌మెంట్‌లో ప్రతిభ కనబర్చినట్లు వీసీ గోవర్ధన్ తెలిపారు. ప్రముఖ సంస్థ వింటేజ్ కాఫీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్‌లో విద్యార్థులు రూ.3.5 లక్షల నుంచి రూ.5 లక్షల వార్షిక వేతనంలో ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషమైన విషయమన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈఈఈ విభాగానికి చెందిన వగ్గ దీక్షిత్, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి బొప్ప నితిన్, కుమ్మరి అర్చన, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం నుంచి జీ వెంకటేశ్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ప్లేస్‌మెంట్ సిబ్బంది మోహన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, మే 11 : క్రీడల్లో గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు రాణించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో నిర్వహించిన వడూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమని వాటిని అంతటికే పరిమితం చేయాలన్నారు. ఓటమితో కృంగిపోకుండా మరింత పట్టుదలతో ముందుకు వెళ్లాలని సూచించారు. క్రీడలతో యువతీ యువకులకు మంచి భవిష్యత్ ఉంటుందని వాటిని దృష్టిలో పెట్టుకొని ముందుకెళ్లాల్సిన అవసరముందన్నారు. అనంతరం గెలుపొందిన జట్టుకు బహుమతులతో పాటు రూ.35,000 నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, ఫయాజ్, నాయకులు భూషణ్, నవీన్, శ్రీకాంత్, సాబ్లే సంతోష్‌సింగ్, వెంకటరమణ, సుజిల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు

నేరడిగొండ మండలం వడూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని భవానీతండాలో రబడే అమర్‌సింగ్ నాయక్ గుడి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే జాదవ్ అనిల్ హాజరయ్యారు. మధుర సమాజ్ గురువు సూరజ్‌సింగ్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ఎదులాపురం: బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, మే 11: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామంలో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్‌లో చించుఘాట్ అంకోలి తలపడగా చించుఘాట్ జట్టు విజేతగా నిలిచింది.. గెలుపొందిన వారికి మాజీ మంత్రి జోగు రామన్న జ్ఞాపికలతో పాటు ఫ్రైజ్ మనీని అందజేశారు. ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు గెలుపొందిన క్రీడా జట్లకు అందజేశారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. అలాగే వ్యసనాలకు దూరంగా ఉంటూ ఐక్యత భావాన్ని పెంపొందిస్తూ దేశ రక్షణలో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలన్నారు. చందాల రాజన్న, సేవా జగదీశ్, అశోక్ స్వామి, ఆప్కం గంగయ్య, కనుక రమణ, బట్టు సతీశ్, దేవీదాస్, పిరంగి మల్లేశ్, ఉగ్గే విఠల్, సురేందర్, మహేశ్, మోతీరామ్, నరేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎదులాపురం, మే 11: ఆదిలాబాద్‌లోని రవీంద్రనగర్‌కు చెందిన తండ్రి శంకర్ (45), కూతురు కృతిక (20) హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు కారులో వస్తుండగా నిర్మల్ జిల్లాలోని నీలాయిపేట బైపాస్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న రవీంద్ర నగర్‌లోని వారి నివాసానికి చేరుకొని భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కల్యాణ ఉత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి

ఎదులాపురం, మే 11: వైశాఖ మాసం శుక్లపక్షం చతుర్థి పర్వదినం సందర్భంగా ఆదిలాబాద్‌లోని శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి జిన్నింగ్ మిల్లులోని ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణమహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో లోక కల్యాణార్థం యాగాలు, హోమాలు నిర్వహించడంతో పాటు చారిత్రాత్మక ఆలయాల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. కార్యక్రమంలో గణేశ్ శర్మ, వినోద్ శర్మ, సంతోష్ శర్మ, కిరణ్ శర్మ, మాజీ ఎంపీపీ చందాల రాజన్న, మాజీ ఎంపీపీ గడ్డం లక్ష్మన్న పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు


జైనథ్: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

జైనథ్, మే 11: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని దీపాయిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008-09లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగయ్య, శ్రీకాంత్, రమేశ్, సుజాత్, జ్యోతి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్, మే 11: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం తిరుమల ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, అంబారీషాచారి, ప్రేమ్‌సింగ్, రవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సోన్, మే 11: నిర్మల్ మండలంలోని రత్నాపూర్‌కాండ్లీ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 2009-10 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 15 సంవత్సరాలు పూర్తయి ఇప్పుడు మళ్లీ కలుసుకోవడంతో చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం అప్పటి గురువులను శాలువా పూలమాలతో సన్మానించారు.

బజార్‌హత్నూర్‌లో ..


సోన్: రత్నాపూర్‌కాండ్లీ జడ్పీహెచ్ఎస్‌లో..

బాధిత కుటుంబానికి పరామర్శ

పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు లోలం శ్యాంసుందర్

కుభీర్, మే 11 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని హల్దా గ్రామానికి చెందిన మారేరావ్ భీంరావ్ ఇటీవల మృతి చెందగా ఆయన కుమారుడు మారేరావ్ విజయ్‌తో పాటు కుటుంబ సభ్యులను ఆదివారం బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు, జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎన్నిల అనిల్, వైస్ ఎంపీపీ మొహియొద్దీన్, పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి పెంటేవార్ దశరథ్, గోరేకర్ కాశీనాథ్, వడ్నం దత్తాద్రి, కొత్తూర్ శంకర్, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులున్నారు.

100 ఏండ్లు నిండిన వృద్ధురాలికి పుట్టిన రోజు

శతాబ్ది వృద్ధురాలికి పుట్టిన రోజు, మాతృమూర్తి దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న కుటుంబ సభ్యులు

జైనథ్, మే 11: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని ముక్తాపూర్ గ్రామంలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వృద్ధురాలికి పుట్టిన రోజు, మాతృ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ముక్తాపూర్ గ్రామానికి చెందిన బుర్రి సుందరబాయి భర్త బుర్రి ఆశన్న కురు దంపతులకు ఐదుగురు కూతుర్లు, ఐదుగురు అల్లుండ్లు, మనవరాళ్లు కలిసి కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించి సంబురాలు జరుపుకున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ అర్బన్, మే 11 : రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారులు మున్సిపల్ కార్యాలయంలో అప్లికేషన్ ఫారం అందించని వారి కోసం ఆదివారం కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని లేదంటే అనర్హులుగా గుర్తిస్తామని అధికారులు తెలిపారు.

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

నేరడిగొండ, మే 11 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కత్తూరి రాజ వెంకటేశ్(35) మృతి చెందగా, అన్వేశ్ అనే వ్యక్తికి గాయాలైనట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కు కారులో వెంకటేశ్, అన్వేశ్ బయలు దేరివెళ్లారు. మార్గమధ్యంలో రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టగా అందులో ప్రయాణిస్తున్న వెంకటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో నిర్మల్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో వ్యక్తి అన్వేశ్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతిడి తమ్ముడు మణికంఠేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌పై నుంచి పడి..

తానూర్, మే 11 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని బెల్తరోడ గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర ఆదివారం ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో కుంటాల మండలం లింబా(బీ) గ్రామానికి చెందిన సంజీవ్ (35) మృతి చెందినట్లు ట్రెయినీ ఎస్ఐ నవనీత్‌రెడ్డి తెలిపారు. తానూర్ నుంచి భైంసా వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉరేసుకుని భర్త ఆత్మహత్య

ఎదులాపురం, మే 11 : ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌లో నివాసముండే రాజేశ్వర్ (47) మద్యానికి బానిస అయ్యాడు. శనివారం రాత్రి భార్య కవ్వ సదాలక్ష్మి మద్యం తాగడానికి డబ్బులు అడగగా ఇవ్వనందున ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎర్రోడ్రాంలోని వేప చెట్టుకు అంగి టవెల్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు.

యువకుడి..

సోన్, మే 11 : నిర్మల్ మ